GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in
# టి-మీడియా
సామాజికం... ప్రజల పక్షం
మెయిన్
సంపుటి : 6 | సంచిక : 280 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | గురువారం 30-05-2024 | పేజీలు : 4

## ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు కేసులో నిందితుడి అరెస్ట్



**టి మీడియా..,మే29, హైదరాబాద్:** ప్రజాభవన్‌కు వచ్చిన బాంబు బెదిరింపు కేసులో పంజాగుట్ట పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రజాభవన్‌లో బాంబు పెట్టామని.. కాసేపట్లో పేలబోతుందని నిన్న పోలీసులకు ఫోన్ చేశాడు. అప్రమత్తమైన పోలీసులు ప్రజాభవన్‌ను జల్లెడ పట్టారు. రెండు గంటలకు పైగా తనిఖీలు చేసి%ా% ఫేక్ కాల్‌గా గుర్తించారు. నిందితుడు శివరామకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతను మద్యం సేవించి కంట్రోల్ రూంకు ఫోన్ చేసినట్లు గుర్తించారు. శివరామకృష్ణ ముషీరాబాద్‌లో ఉంటున్నాడు. అతనిని గుంటూరు జిల్లా వాసిగా గుర్తించారు

## తెలంగాణ రాష్ట్ర గీతం రూపకల్పనపై ప్రముఖులతో సీఎం రేవంత్ సమావేశం

**టి మీడియా,మే 29,హైద్రాబాద్ :**
తెలంగాణ రాష్ట్ర గీతం విషయంతో సీఎం రేవంత్ సర్కార్ కీలక అడుగులు వేస్తోంది. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర గీతం రూపకల్పన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. తెలంగాణ రాష్ట్రం అవిర్భవించి దశాబ్దం పూర్తైన నేపథ్యంలో కొత్తగా ఒక గీతాన్ని రూపొందించాలని సంకల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వం.ఈ గీతం రూపకల్పనపై కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు కీరవాణితో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష నిర్వహించారు. వీరితో పాటు ఈ సమావేశానికి మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, రఘు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రాంచంద్రు నాయక్, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే సంపత్, ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్, తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో జరిగింది. అయితే దీనిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ విమర్శిస్తోంది. ఇప్పటికే తెలంగాణ వాహన రిజిస్ట్రేషన్ లో టీఎస్ గా ఉండే అక్షరాలను టీజీగా మార్పులు చేసింది. మరోవైపు ఆర్టీసీ లోగో, పేరును కూడా మరుస్తూ సంచలన నిర్ణయాలు తీసుకున్నారు సీఎం రేవంత్. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ధి దినోత్సవం సందర్భంగా ఈ రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించనుంది.



### ఎన్నికల్లో పట్టుబడిన నగదు
## రూ.107.96 కోట్లు
**-మద్యం విలువ రూ.58.70 కోట్లు**
**-గణాంకాలు వెల్లడించిన ఈసీ**




**టి మీడియా..,మే29,అమరావతి బ్యూరో** :ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల సమయంలో ఈసీ ప్రత్యేక నిఘా ఉంచింది. సరిహద్దు ప్రాంతాల్లో 31 ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులతో సహా మొత్తం 150 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. 35మొబైల్ బోర్డర్ పెట్రోలింగ్ పార్టీస్ ను అందుబాటులో ఉంచింది. వీటన్నింటితో పాటు 18 టెంపరరీ చెక్ పోస్ట్?లను కూడా ఏర్పాటు చేసింది. ఇలా ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో పట్టుబడ్డ నగదు, మద్యం వివరాలను ఈసీ తాజాగా వెల్లడించింది. గత 2019లో జరిగిన ఎన్నికల్లో పట్టుబడ్డ నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, లోహాలు విలువతో పాటుగా ఈ సారి 2024 సార్వత్రిక ఎన్నికల్లో జరిగిన అక్రమ రవాణా గురించి పూర్తి వివరాలను వెల్లడించింది. 2019లో ఏపిలో పట్టుబడ్డ నగదు రూ.41.80 కోట్లు కాగా 2024 లో పట్టుబడ్డ నగదు రూ.107.96 కోట్లుగా తెలిపింది. మొత్తం కలిపి 7,305 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ప్రకటించింది. ఇక మద్యం విషయానికి వస్తే 2019 పట్టుబడ్డ అక్రమ మద్యం విలువ రూ.8.07 కోట్లుగా తెలిపింది. అదే 2024 లో పట్టుబడ్డ అక్రమ మద్యం విలువ రూ.58.70 కోట్లుగా చెప్పింది. ఈ సారి అదుపులోకి తీసుకున్న నిందితుల సంఖ్య గతంలో కంటే పెద్ద ఎత్తున పెరిగినట్లు తెలిపింది. మొత్తం 61,543 మంది అరెస్ట్ చేసినట్లు వెల్లడించింది.2019 ఎన్నికల సమయంలో పట్టుబడిన నిషేధిత మాదక ద్రవ్యాల విలువ రూ. 5.04 కోట్లు కాగా 2024 ఎన్నికల్లో పట్టుబడిన నిషేధిత డ్రగ్స్ విలువ రూ. 35.61 కోట్లుగా తెలిపారు. ఈ వ్యవహారంలో మొత్తం 1730 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ప్రకటించారు. ఇక 2019 ఎన్నికల సమయంలో స్వాధీనం చేసుకున్న విలువైన లోహాల విలువ రూ.27.17 కోట్లు కాగా.. 2024 ఎన్నికల్లో పట్టుబడిన విలువైన లోహాల విలువ రూ.123.62 కోట్లు అని చెప్పింది ఎన్నికల కమిషన్. ఈ అక్రమ వ్యవహారాల్లో పట్టుబడిన వారి సంఖ్య 42గా పేర్కొంది. 2019 ఎన్నికల సమయంలో స్వాధీనం చేసుకున్న ఉచితాలు/ఇతర వస్తువుల ద్రవ్య విలువ రూ.10.63 కోట్లు కాగా 2024 ఎన్నికల్లో పట్టుబడిన ఉచితాలు/ఇతర వస్తువుల విలువ రూ.16.98కోట్లుగా ప్రకటించింది. అక్రమంగా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడిన మొత్తం 233 మందిని అరెస్టు చేసినట్లు వివరించింది. మొత్తం 3,466 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు అధికారులు. గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి ఎన్నికలు చాలా ఖర్చుతో కూడుకున్నట్లు చెప్పవచ్చు. ఈ మొత్తాన్ని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు ప్రజలు.

## జూన్ 1న ఏడో దశ
**-199 మంది అభ్యర్థులు నేరచరితులే**
**-కోటీశ్వరులు 299 మంది**



**టి మీడియా, మే 29,న్యూఢిల్లీ :** లోక్‌సభకు జూన్ 1వ తేదీన జరిగే ఏడవ, చివరి విడత ఎన్నికల్లో 904 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదిక ప్రకారం వీరిలో 22% మంది అంటే 199 మందికి నేర చరిత్ర ఉంది. ఏడు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో జరిగే ఏడో విడత ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థుల అఫిడవిట్లను ఎడిఆర్, నేషనల్ ఎలక్షన్ వాచ్ విశ్లేషించాయి. తుది దశలో బీహార్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, జార?ండ్, ఒడిషా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లోని 57 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి.

### కేసుల స్వభావం
తమపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయని 151 మంది (17%) అభ్యర్థులు తమ అఫిడవిట్లలో ప్రకటించారు. ఈ తరహా కేసుల్లో నేరం రుజువైతే ఐదు లేదా అంతకంటే ఎక్కువ సంవత్సరాల జైలుశిక్ష పడుతుంది. ఇవి నాన్ బెయిలబుల్ కేసులు. ఏడో దశలో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో 13 మందికి శిక్షలు పడ్డాయి. తమపై హత్య కేసులు నమోదై ఉన్నాయని నలుగురు తెలిపారు. 27 మందిపై హత్యాయత్నం కేసులు, 25 మందిపై విద్వేష ప్రసంగాల కేసులు ఉన్నాయి. మహిళలపై నేరాలకు సంబంధించి 13 మంది అభ్యర్థులపై కేసులు ఉన్నాయి. వీరిలో ఇద్దరిపై అత్యాచారానికి సంబంధించిన ఆరోపణలు ఉండడం గమనార్హం.

### పార్టీల వారీగా
%పార్టీల విషయానికి వస్తే%ా% మిగతా పార్టీల కంటే బిజెపి నుంచే నేరచరితులు ఎక్కువగా బరిలో ఉన్నారు. బిజెపికి చెందిన 51 మంది అభ్యర్థుల్లో 23 మందిపై క్రిమినల్ అభియోగాలు ఉన్నాయి. వీరిలో 18 మందిపై మోపిన ఆరోపణలు తీవ్రమైనవి. ఆమ్‌ఆద్మీ తరఫున పోటీ చేస్తున్న 13 మందిలో ఐదుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన తొమ్మిది మంది అభ్యర్థుల్లో ఏడుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. తృణమూల్ కాంగ్రెస్ తరఫున తొమ్మిది మంది పోటీ చేస్తుండగా, వారిలో ఏడుగురిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీరిలో ముగ్గురిపై తీవ్రమైన అభియోగాలు ఉన్నాయి.
సిపిఎంకు చెందిన ఎనిమిది మంది అభ్యర్థుల్లో ఐదుగురు, శిరోమణి అకాలీదళ్‌కు చెందిన 13 మందిలో ఎనిమిది మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 31 మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లో 12 మందిపై, సిపిఐకి చెందిన ఏడుగురిలో ఇద్దరిపై, బిఎస్‌పికి చెందిన 56 మందిలో 13 మందిపై కేసులున్నాయి.

### కోటీశ్వరులు వీరే
ఏడో దశలో పోటీ పడుతున్న 904 మంది అభ్యర్థుల్లో 299 మందికి కోటి, అంతకంటే ఎక్కువ విలువ కలిగిన ఆస్తులు ఉన్నాయి. శిరోమణి అకాలీదళ్‌కు చెందిన 13 మంది, అమ్‌ఆద్మీకి చెందిన 13 మంది, బిజెడికి చెందిన ఆరుగురు, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన 9 మంది, కాంగ్రెస్‌కు చెందిన 30 మంది, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఎనిమిది మంది, బిజెపికి చెందిన 44 మంది, సిపిఎంకు చెందిన నలుగురు, బిఎస్‌పికి చెందిన 22 మంది అభ్యర్థులు కోటీశ్వరులే. వీరిలో అత్యంత ధనవంతుడైన శిరోమణి అకాలీదళ్ అభ్యర్థి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ ఆస్తుల విలువ రూ.198 కోట్లు. బిజెపికి చెందిన వైజయంత్ పాండా రూ.148 కోట్లు, హిందూత్వ పార్టీకి చెందిన సంజరు టాండన్ రూ.111 కోట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఉత్కల్ సమాజ్ పార్టీ అభ్యర్థి భానుమతి దాస్ తన ఆస్తుల విలువను కేవలం రూ.1,500గా చూపారు.



### కవిత కేసు విచారణ
## జూన్ 3 కు వాయిదా..


**టి మీడియా..,మే29,ఢిల్లీ :**మద్యం కేసులో కవితతో పాటు మరో నలుగురిపై ఈడీ మే 10న దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక కోర్టు పరిగణనలోకి తీసుకుంది. మద్యం కేసులో కవితతో పాటు నలుగురి పాత్రపై ఈ ఛార్జిషీట్‌లో తెలిపారు. జూన్ 3న ఈ ఛార్జిషీట్‌పై కోర్టు విచారణ జరపనుంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న కవిత, చరణ్ ప్రీత్‌లకు ప్రొడక్షన్ వారెంట్లు జారీ చేసింది. మిగతా నిందితులు ప్రిన్స్ కుమార్, అరవింద్ సింగ్, దామోదర్ శర్మలు జూన్ 3న తమ ఎదుట హాజరుకావాలని కోర్టు ఆదేశించింది. దీంతో కవితను జూన్ 3న ఈడీ అధికారులు కోర్టు ఎదుట హాజరుపరచనున్నారు.



### సింగరేణి మెడికల్ బోర్డులో...
## అవకతవకలు
**-దర్యాప్తులో వెలుగులోకి కీలక విషయాలు**


**టి మీడియా.., మే29, కొత్తగూడెం బ్యూరో:** సింగరేణి మెడికల్ బోర్డులో అవకతవకలు తీవ్ర కలకలం సృష్టిస్తుంటే.. వాటిపై జరుగుతున్న విచారణ అంతకు మించి ఆసక్తిరేపుతోంది. కొత్తగూడెం ప్రధాని ఆస్పత్రిలో సీఐడీ తనిఖీలతో.. కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్టు తెలుస్తోంది. అసలు మెడికల్ మాఫియా వెనక ఎవరున్నారు? రెండునెలలుగా జరుగుతున్న విచారణలో ఏం తేలింది? అన్నదే చర్చనీయాంశంగా మారింది. సింగరేణి మెడికల్ బోర్డులో జరిగిన అవినీతిపై.. సీఐడీ విచారణ వేగవంతమైంది. సింగరేణి వ్యాప్తంగా లక్షలాది రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు గుప్పుమనడంతో.. ఇటీవల ఎండీగా బాధ్యతలు స్వీకరించిన ఎన్. బలరాం, రాష్ట్ర ఏసీబీ అడిషనల్ డీజీపీ సీవీ ఆనంద్ కు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన విచారణ బృందం.. జరిగిన అవకతవకలపై రెండు నెలలుగా ఆరా తీస్తోంది. తాజాగా, వరంగల్ ఏరియాలోని సీఐడీ విభాగం అధికారులు.. కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రుల్లో, ప్రధాన కార్యాలయంలో విచారణ జరిపారు. కీలకమైన ఫైల్స్‌ను పరిశీలించారు. గతంలో మెడికల్ బోర్డుకు అన్ ఫిట్ అయిన వారినుంచి వివరాలు సేకరించిన సీఐడీ అధికారులు.. వారు ఆన్ఫిట్ ఎలా అయ్యారు? ఈ విషయంలో పైరవీలు జరిగాయా? అనే కోణంలో విచారిస్తున్నారు. వారికి ఉన్న వ్యాధులు ఏంటి? అనే అంశంపైనా అసలు విషయాన్ని కనిపెట్టే పనిలో ఉన్నారు. అయితే, ఈ విషయంలో విచారణ జరుగుతోందని తెలియడంతో.. కార్మిక నాయకులు, సింగరేణి ఉద్యోగుల గుండెల్లో గుబులు మొదలైనట్టు తెలుస్తోంది.మెడికల్ బోర్డులో చక్రం తిప్పినవారు.. ఇప్పుడు తమజాతకం తిరగబడుతుందేమోనని భయపడుతున్నారు. ప్రధానంగా గత ప్రభుత్వహయంలో సింగరేణిలో కీలకంగా వ్యహరించిన నాయకులు, ఉద్యోగులను సైతం సీఐడీ విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఇప్పుడా బ్యాచ్ అంతా భయంభయంగా కాలం వెల్లదీస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే సీఐడీ అధికారులు.. ఇల్లందు, మణుగూరు, కొత్తగూడెం ఏరియాల్లో ఏరియాలో కొంతమందిని విచారించినట్లు తెలుస్తోంది. అవకతవకలు బయటపడితే తమ పరిస్థితి ఏమిటనేది.. పైరవీ బ్యాచ్‌ను వెంటాడుతున్న భయం. తాము చేసిన సెటిల్మెంట్లన్నీ బయటకు వచ్చేస్తే శిక్ష తప్పదని తీవ్ర ఆందోళన చెందుతున్నట్టు తెలుస్తోంది. సీఐడీ అదికారులు పూర్తిస్థాయిలో విచారణ కొనసాగిస్తే.. ఈ మెడికల్ దాందాలో మరిన్ని అవకతవకలు వెలుగులోకి వస్తాయని పలువురు ఉద్యోగులు బహిరంగంగానే చెబుతున్నారు. అయితే, దీనిపై పూర్తి వివరాలను బయటకు పొక్కనీయకుండా గోప్యతను ప్రదర్శిస్తున్నారు. అధికారులు సైతం.. తమకేమీ తెలియదన్నట్టుగానే ఉంటున్నారు. గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ విచారణలో ఎవరి జాతకాలు ఎప్పుడు బయటకు వస్తాయో చూడాలి మరి.

## న్యాయమూర్తులు ఫోన్ లు ట్యాపింగ్
**- నాళా లో సెల్ ఫోన్ లు, పెన్ డ్రైవ్ లు**
**- ప్రణీత రావు వాంగ్మూలం**



**టి మీడియా,మే 29,హైదరాబాద్ :**
ఫోన్ ట్యాపింగ్‌లో ప్రణీతరావు వాంగ్మూలంలో సంచల విషయాలు వెల్లడించారు.1200 మంది ఫోన్లను ప్రణీత్ రావు ట్యాప్ చేసినట్లు పేర్కొన్నారు. జడ్జిలు, రాజకీయ నేతలు, ప్రతిపక్ష నేతలు, వారి కుటుంబ సభ్యులు, మీడియా పెద్దలు, జర్నలిస్టులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, వ్యాపారవేత్తలు, ప్రతిపక్షాలకు ఆర్థిక సహాయం చేస్తున్న వారి ఫోన్లను ట్యాప్ చేసినట్టు వెల్లడించారు.

### సెల్‌ఫోన్లు, పెన్‌డ్రైవ్‌లను నాలాలో పడేశాం
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ట్యాపింగ్ మొత్తాన్ని ఆపివేయాలని ప్రభాకర్ రావు చెప్పారని ప్రణీత్ రావు వెల్లడించారు. ప్రభాకర్ రావు రాజీనామా చేసి వెళ్ళిపోతూ టైపింగ్ సంబంధించిన సమాచారం ధ్వంసం చేయాలని ఆదేశించారని తెలిపారు. ప్రభాకర్ రావు ఆదేశాలతో 50 కొత్త హార్డ్ డిస్క్‌లను తీసుకువచ్చామన్నారు. పాత వాటిలో కొత్త హార్డ్ డిస్క్‌లు ఫిక్స్ చేశామన్నారు. 17 హార్డ్ డిస్క్‌లలో అత్యంత కీలకమైన సమాచారం ఉందన్నారు. 17 హార్డ్ డిస్క్ లను కట్టర్‌తో కట్ చేసి ధ్వంసం చేశామన్నారు. పెద్ద ఎత్తున ఉన్న సీడీఆర్‌తో ఐడీపీఆర్ డాటా మొత్తాన్ని కూడా కాల్చివేసినట్టు ప్రణీత్ రావు వెల్లడించారు. పెన్ డ్రైవ్‌లు, హార్డ్ డిస్క్, ల్యాప్‌టాప్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల్లో ఉన్న డాటా మొత్తాన్ని ఫార్మాట్ చేశామన్నారు. ధ్వంసం చేసిన హార్డ్ డిస్క్‌లన్నింటినీ కూడా నాగోల్ మూసారంబాగ్ మూసిలో పడవేసినట్టు తెలిపారు. ఫార్మాట్ చేసిన సెల్ ఫోన్లు, పెన్ డ్రైవ్ల అన్నిటిని కూడా బేగంపేట నాలాలో పడేసినట్టు ప్రణీత్ రావు తెలిపారు.



### ఛత్తీస్‌గఢ్‌లో.మరోసారి
## కాల్పులు
**-ఇద్దరు మావోయిస్టులు హతం**

**టి మీడియా..,మే29,బద్దేడ్:** ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఓ మహిళా మావోయిస్టుతో పాటు మరో దళ సభ్యుడు ఉన్నారు. బీజాపూర్ జిల్లా బద్దేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బద్దెపారా అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు పోలీస్ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో బుధవారం ఉదయం ఆ ప్రాంతంలో భద్రతా దళాలు సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు జరిపారు. దీంతో భద్రతాబలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. ఇరువర్గాల మధ్య సుమారు 20 నిమిషాల పాటు భీకర పోరు జరగడంతో.. ఆ ధాటికి తాళలేక మావోయిస్టులు అటవీమార్గంలో పారిపోయారు. ఘటనాస్థలి నుంచి ఆయుధ, వస్తు సామగ్రిని భద్రతాబలగాలు స్వాధీనం చేసుకున్నాయి.



## మేడిగడ్డలో కొనసాగుతున్న మరమ్మతు పనులు

**టి మీడియా..,మే29,జయశంకర్ భూపాలపల్లి :** జిల్లా మహదేవపూర్ మండలంలోని అంబట్‌పల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్‌లో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులను బుధవారం భారీ నీటిపారుదల శాఖ ఈఈ తిరుపతిరావు పర్యవేక్షించారు. పనుల తీరుపై అధికారులతో చర్చించారు. బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో కుంగిన పియర్ ఖాళీ ప్రదేశాలతో గ్రౌటింగ్ చేసేందుకు ప్రారంభించిన బోర్ హెూల్ పనులు, 20, 21 గేట్ కట్టింగ్, బరాజ్ దిగువన వరద ఉధృతితో ఎలాంటి ప్రభావం లేకుండా ఉండేందుకు ఇసుకలో కాపర్ షీట్ ఫైల్స్‌లను యంత్రాల సాయంతో అమర్చుతున్నారు. వరద నీటితో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు బరాజ్ ఎనిమిదో బ్లాక్ వరకు వరద నీటి ప్రవాహం రాకుండా మట్టి కరకట్ట పనులు జరుగుతున్నాయి. బరాజ్ దిగువన సీసీ బ్లాక్ అమర్చుతున్నారు. అప్‌స్టీమ్, డౌన్ స్టీమ్‌లో వరద నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ఇసుక, రాళ్లను తొలగిస్తున్నారు.

# ఆదివాసీలు జీవన శైలి భిన్నం

## -ఆరోగ్య రహస్యం చీమల గుడ్లతో పై

**టి మీడియా, మే 29, హైదరాబాద్:** ఏజెన్సీ ప్రాంతాల్లోని వలస ఆదివాసీలు బాహ్య ప్రపంచానికి దూరంగా తమ సాంప్రదాయాలు, ఆచారాలు, ఆహారపు అలవాట్లను కొనసాగిస్తున్నారు. అటవీ ప్రాంతంలో జీవనం సాగిస్తూ వస్తున్న వీరి జీవన శైలి భిన్నం గానే ఉంటుంది. వీళ్ళు ఎక్కువగా అడవులపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఆహారపు అలవాట్లు భిన్నంగా ఉంటాయి. అందుకే నేమో వీళ్ళు ఆరోగ్యంగా ఉంటారు. ఇప్పటికీ అడవుల్లో దొరికేటువంటి చీమలు పెట్టే గుడ్లను సేకరించి కూరగా వండుకుని తింటున్నారు ఇక్కడ ఆదివాసీలు. భద్రాద్రి కొత్త గూడెం జిల్లా పాల్వంచ మండలం బంద్రుగొండ పంచాయతీ పరిధిలోని అడవిలో ఉన్న కోయగట్టు గుంపులో ఆదివాసీలు వేసవికాలం వచ్చిందంటే వాగుల పక్కనున్న చెట్లపై ఉండే చెదలే వారి ఆహారం. ముఖ్యంగా మామిడి చెట్లపై పులి చీమల ఆకులను గూళ్ళుగా ఏర్పరచుకుని గుడ్లు పెడుతూ ఉంటాయి. ఈ చీమలు పెట్టిన గుడ్లను గిరిజనులు సేకరించి అడవిలో దొరికే బొద్దం కూరతో కలిపి వండుకుని తింటారట. ఇలా వండుకున్న కూర రుచిగా ఉంటుందని కూర తినడం వల్ల ఆరోగ్యంగా, బలంగా ఉంటామని చెబుతున్నారు అదివాసీలు. దీంతో జలుబు, దగ్గు వచ్చినప్పుడు గ్రామంలో ప్రతి ఒక్కరు ఈ కూర వండుకుని తింటామని తెలిపారు. అంతే కాకుండా ప్రపంచ దేశాలను గడగడలాడించిన కరోనా సమయంలో కూడా ఈ కూర వండుకుని తినటం వల్ల వ్యాధి బారిన



పడకుండా బయట పడ్డామని గిరి పుత్రులు తెలుపుతున్నారు. ఈ గుడ్ల ను సేకరించడంలో అత్యంత చాకచక్యం గా సేకరించవలసి ఉంటుంది. లేదంటే ఆ చీమలు కుడితే తేలు కుట్టి నంత బాధ ఉంటుందంటున్నారు ఆదివాసీలు.

# అదుపుతప్పిన బిజెపి నేత బ్రిజ్ భూషణ్ కుమారుడి కారు

## - ఇద్దరు యువకులు మృతి

**టి మీడియా, మే 29,గోండా:** బిజెపి నేత బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కుమారుడు కరణ్ భూషణ్ సింగ్ కాన్వాయ్ లో ఉన్న ఫార్చ్యూనర్ కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన బుధవారం ఉదయం ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో జరిగింది. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు పాదచారులకు తీవ్రగాయాలయ్యాయి. కల్నల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హుజూర్‌పూర్-బహ్రైచ్ రైల్వే క్రాసింగ్ సమీపంలో ఉదయం, కైసర్‌గంజ్ లోక్‌సభ స్థానం నుండి బిజెపి అభ్యర్థి.. సిట్టింగ్ బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కుమారుడు కరణ్ భూషణ్ సింగ్ కాన్వాయ్ లో ఉన్న ఫార్చ్యూనర్ కారు అదుపు తప్పింది. వేగంగా వస్తున్న ఈ కారు బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు కొన్ని కిలోమీటర్ల దూరంలో పడిపోయారు. మరో ఇద్దరు పాదచారులను కూడా కారు ఢీకొట్టడంతో వారిద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వాహనం ముందు భాగం బాగా దెబ్బతింది. కారులోని ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో కారులో ఉన్నవారంతా సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన తర్వాత కారులో ఉన్నవారంతా అక్కడినుండి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులందరినీ వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతులు రెహాన్ ఖాన్, షెహజాద్ ఖాన్‌లుగా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరూ ఆసుపత్రిలో చికిత్స



పొందుతున్నారు. విషయం తెలిసిన వెంటనే ప్రజలంతా సీహెచ్‌సీ వద్ద గుమిగూడారు. ఆగ్రహంతో సీహెచ్‌సీని ముట్టడించారు. సమాచారం అందిన వెంటనే జిల్లా ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ప్రమాదంలో మృతుడు రెహాన్ ఖాన్ తల్లి చందాబేగం కల్నల్‌గంజ్ కొత్వాలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మార్గమధ్యంలో ఛటై పూర్వ బస్ స్టాప్ కంటే ముందు ఎదురుగా వస్తున్న ఫార్చ్యూనర్ వాహనం యుపి 32 హెచ్‌డబ్ల్యు 1800 అజాగ్రత్తగా అతివేగంతో వచ్చి కుడివైపుకు వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. మరో ఇద్దరు పాదచారులను కూడా ఢీకొట్టింది.

# డివైడర్ ను ఢీ కొట్టిన బైక్, ఇద్దరు దుర్మరణం

**టి మీడియా.,మే29,హుజూర్ నగర్ రూరల్:** సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ మండలం గోపాలపురం దగ్గర రోడ్డు ప్రమాదం జరిగింది. డివైడర్ను ఢీ కొట్టిన బైక్ ఇద్దరు మృతి చెందగా,ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నది. మృతి చెందిన వారు గరిడేపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన వారిగా గుర్తింపు. బైక్ పై వెళ్తున్న కుర్ర సైదులు పాప శ్రీజ మృతి. మరొక వ్యక్తికి తీవ్రగాయాలు. గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉండటంతో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలింపు. వెంకట్రాంపురం నుంచి హుజూర్నగర్ వెళ్తుండగా ఘటన. జరిగింది.



# సొసైటీ ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు

## ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి.

**ముదిగొండ మే 29(టీ మీడియా)** సొసైటీ ద్వారా రైతులకు పచ్చిరొట్టె విత్తనాలను పంపిణీ చేస్తున్నామని ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి చెప్పారు. ముదిగొండ సొసైటీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వము అందిస్తున్న అవకాశాలను రైతులు ఎ ` ది ్వ ని య ా వా గ ` ం చేసుకోవాలన్నారు. ముదిగొండ సొసైటీలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు జిలుగు,జనుము విత్తనాలు పంట భూముల భూసారం పెంచుకునేందుకు రైతులు ఉపయోగించుకోవాలన్నారు. జీలుగు 30 కేజీల బస్తా రూ1116 ,జనుము,40 కేజీల బస్తా రూ1448 ధర ఉందని,పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు తమ పొలం పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ తో,స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి కూపన్ తీసుకొని సొసైటీలో విత్తనాలను పొందవచ్చున్నారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలను అందజేస్తుందని,రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సొసైటీ చైర్మన్ యలగొండస్వామి అన్నారు.



# అగ్ని బాధిత కుటుంబాలకు జామాల్ ఖాన్ ట్రస్ట్ ద్వారా 10వేలనగదు వితరణ.

**టీ.మీడియా,మే29,చింతూరు:** కూనవరం మండలం లోని గొమ్ముగూడెం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదం లో రెండు ఇల్లు పూర్తిగా దగ్ధం అయినావి. వివరాల్లోకి వెళితే కంటెం బాబురావు కు చెందిన పూ రిల్లు మరియు కొక్కిరాల అనంత రావు వంట పాక కాలిపోయినవి. ఇంటి వద్ద ఎవ్వరూ ఆసమయంలో లేనందున పూచిక పుల్ల తో సహా కలిపోయి నిలువ నీడ లేకుండా రోడ్డు న పడ్డారు. విషయం తెలుసు కున్న ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమల్ ఖాన్ వెంటనే గొమ్ముగూడెం గ్రామములో లో జరిగిన సంఘటన వద్దకు వెళ్లి అగ్ని బాధిత కుటుంబాలను పరామర్శించి నారు. అన%శీ%తరం జే.కే. సి.టి ట్రస్ట్ ద్వారా ఒక్కో కుటుంబానికి ఐదు వేల రూపాయల చొప్పున పదివేలు నగదు అందజేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధల్లో ఉన్న వారిని ఓదార్చడం చేతనైన సహాయం చేసి ఆదు కోవటం చేయాలనియన్నారుఇంటి నిర్మాణానికి కావలసిన సామాగ్రిని తాను త్వరలో అందజేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్య క్రమంలో గ్రామ పెద్దలు సూఫీ,శ్రీమ%శీ%తుల వెంకట రమణ, సర్పంచ్ సొందే రామయ్య,కొక్కిరాళ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



# నేడు మహానందిలో కానుకల హుండీ లెక్కింపు

**టీ మీడియా,మే29, మహానంది:** మహానంది పుణ్యక్షేత్రంలో గురువారం కానుకల హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానిక అభిషేక మండపంలో ఉదయం 7:00గంటల నుంచి ఉభయ దేవాలయముల హుండీ లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది,అర్చకులు, ఏజెన్సీ వర్కర్స్, తదితరులు పాల్గొనాలని తెలిపారు.






# దుబాయ్ వెళ్ళాలనే సంకల్పంతో చోరీలు

## -లక్ష్య సాధన కోసంమార్గం ఎంచుకున్న దొంగ

**టి మీడియా, మే 29,వరంగల్:** లక్ష్యం సాధించడం కోసం శ్రమిస్తారు. కానీ వీడు అదో టైపు.. లక్ష్య సాధన కోసం దొంగతనాలు కర్తవ్యంగా పెట్టుకున్నాడు. ఎలాగైనా దుబాయ్ వెళ్ళాలనే సంకల్పంతో చోరీ లకు బరి తెగించాడు. తాళం వేసి ఉన్న ఇళ్లు కనబడితే చాలు ఇల్లు గుల్లే..! ఇప్పటివరకు 38 ఇళ్లలో చోరీలకు పాల్పడ్డ ఆ ఘరానా దొంగ ఎట్టకేలకు వరంగల్ సీసీఎస్ పోలీసులకు చిక్కాడు. వరంగల్ తో పాటు చుట్టు పక్కల జిల్లాలో జరుగుతున్న వరుస దొంగతనాలపై నిఘా ముమ్మరం చేసిన పోలీసులు నాగరాజు అనే దొంగను అరెస్ట్ చేశారు. నిందితుడి నుండి సుమారు 22లక్షల రూపాయల విలువల్కైన 270 గ్రాముల బంగారు అభరణాల తోపాటు, రెండు ద్విచక్రవాహనాలు, 50వేల రూపాయల నగదు, ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుని లక్ష్యం విని పోలీసులు షాక్ అయ్యారు. ఎలాగైనా దుబాయ్ వెళ్ళాలని డ్రీమ్ పెట్టుకున్న నాగరాజు ఇళ్లలో దోపిడీలకు బరి తెగించాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం సంకేపల్లి గ్రామానికి చెందిన నాగరాజు ప్రస్తుతం సిద్దిపేట జిల్లా చేర్యాలలో నివాసం వుంటున్నాడు. ద్విచక్ర వాహన మెకానిక్‌గా పనిచేస్తూనే జల్సాలకు అలవాటు పడ్డాడు. మరింత పెద్ద మొత్తంలో డబ్బు సులభంగా సంపాదించాలని, ఎలాగైనా దుబాయ్ వెళ్ళాలనే ఆలోచనతో చోరీలకు పాల్పడ్డాడు. వరంగల్, కరీంనగర్, కామారెడ్డి, సిద్దిపేట, వేములవాడ తో పాటు మరికొన్ని ప్రాంతాల్లో గతంలో ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడి పోలీసులకు చిక్కి జైలు పాలయ్యాడు.. జైలు జీవితం అనంతరం కూడా నిందితుడిలో ఎలాంటి మార్పు రాకపోగా, ద్విచక్రవాహనాలు చోరీలకు స్వస్తి పలికి, తాళం వేసి ఉన్న ఇండ్లల్లో చోరీలను మొదలు పెట్టాడు. 2022 నుండి ఇప్పటి వరకు వరంగల్, జనగామ, సిద్దిపేట, భూపాలపల్లి, జగిత్యాల, యాదాద్రి జిల్లాల్లో మొత్తం 38కి పైగా తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడ్డాడు. ఇందులో వరంగల్ లోని మట్టెవాడ, మీల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు చొప్పున, అలాగే ఇంతేజార్‌గంజ్, కెయూసీ, హనుమకొండ, ఐనవోలు, నల్లబెల్లి, జనగాం, బచ్చన్నపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకటి చొప్పున తాళం వేసి ఉన్న ఇండ్లల్లో చోరీలకు పాల్పడ్డట్లు పోలీసులు తెలిపారు. ఈ చోరీలపై అప్రమత్తమైన పోలీసులు ట్రైనీ ఐపిఎస్ అధికారి శుభం నాగ్ అధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. చోరీలు జరిగిన ప్రదేశాల్లో లభించిన అధారాలతో పాటు ప్రస్తుతం పోలీసుల వద్ద ఉన్న టెక్నాలజీని వినియోగించి నిందితుడిని గుర్తించారు. చోరీ చేసిన బంగారు అభరణాలు, పెద్ద మొత్తం నగదు లభించడంతో నిందితుడిని అదుపులోకి తీసుకోని విచారించగా, తాను చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల ఎదుట అంగీకరించాడు. నిందితుడుని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

# నిషేధిత గుట్కా స్వాధీనం.కేసు నమోదు.

**టి మీడియా.,మే 29. మేళ్ళ చెరువు:** మేళ్ళ చెరువు యస్ ఐ. పరమేష్ ఆధ్వర్యంలో బుధవారం నిషేధిత గుట్కా తనిఖీలు మేళ్ళ చెరువు మండల కేంద్రంలో చేపట్టడం జరిగింది. స్థానిక మెయిన్ రోడ్ లో గల పాన్ షాప్ , కిరాణా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా మేళ్ళ చెరువుకు చెందిన గోళ్ళ సతీష్ కు చెందిన శ్రీ వేంకటేశ్వర స్వీట్ దుకాణం లో గుట్కాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడమైనది. వాటి విలువ, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

## ఎసన్నాహక సమావేశంలో మాజీ మంత్రి

**టీ మీడియా, మే 29, వనపర్తి బ్యూరో :** తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు బి.ఆర్.ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాలి అని గౌరవ నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆవిర్భావ దినోత్సవ సన్నాహ సమావేశంలో మాట్లాడుతూ 14ఏండ్ల ఉద్యమ సమయంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని తెలంగాణ రాష్ట్రం సాధించి కె.సి.ఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపారు అని అన్నారు. ఆంధ్రపాలకుల బానిస పాలన నుండి కె.సి.ఆర్ చావు నోట్లో తలకాయ పెట్టి స్వతంత్ర తెలంగాణ సాధించినాం అని ఎందరో అమరవీరుల త్యాగఫలితాలని ప్రజలకు వివరించాలని కోరారు. మూడు రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహించాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేసారు. ఈ సన్నాహక సమావేశంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, వాకిటి.శ్రీధర్, కురుమూర్తి యాదవ్ పట్టణ అధ్యక్షులు పి.రమేష్ గౌడ్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పెండింగ్ రోడ్డు విస్తరణలో కదలిక

## ఎంఎమ్మెల్యే మేఘా రెడ్డి చొరవతో పనులు ప్రారంభం

**టీ మీడియా , మే 29, వనపర్తి బ్యూరో :** వనపర్తి పట్టణంలో సుమారు ఎనిమిది నెలలుగా పెండింగ్లో ఉన్న రోడ్ల విస్తరణ పనులకు మోక్షం కలిగింది. ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఆదేశాలతో బుధవారం జిల్లా కేంద్రంలో విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. గతంలో రోడ్ల విస్తరణలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించకపోవడంతో అసంపూర్తిగా పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో పట్టణ ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయాలు కలుగుతున్నాయని గుర్తించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి. కాంట్రాక్టర్లకు బకాయి సొమ్ము ఇప్పించేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేయడంతో ఈ మేరకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కాంట్రాక్టర్లకు డబ్బును రిలీజ్ చేసింది. రూ 25 కోట్ల డబ్బులను కాంట్రాక్టర్లకు ఇప్పించడంతో ఈ మేరకు బుధవారం వనపర్తిలో పెండింగ్ ఉన్నచోట్ల విస్తరణ పనులు ప్రారంభం అయ్యాయి. త్వరలోనే పట్టణ ప్రజలకు కలుగుతున్న అసౌకర్యాలు ఇబ్బందులు ఎమ్మెల్యే కృషితో తొలగనున్నాయి. ఎన్ని రోజులు ఎమ్మెల్యే మెఘారెడ్డి గారు విస్తరణ పనులు చేపట్టడం లేదని వాదించిన ఇతండవాదులకు ఇదో చెంపపెట్టు నిదర్శనం ఈ పనులను బుధవారం వనపర్తి నియోజకవర్గం సమన్వయకర్త లక్కాకుల సతీష్ , వనపర్తి పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్, మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు, అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్ పరిశీలించారు. వనపర్తిలో అసంపూర్తిగా ఉన్న రోడ్ల విస్తరణ పనులను పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే కృత నిశ్చయంతో ఉన్నారని అన్నారు. ప్రజల ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అందరూ మెచ్చేలా అభివృద్ధి పనులు త్వరగా తిన పూర్తికానున్నాయని ఈ సందర్భంగా వారు వ్యాఖ్యానించారు.



# నూతన గృహప్రవేశానికి హాజరైన చిన్నారెడ్డి

**టీ మీడియా, మే 29, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా పానగల్ మండలం కేతపల్లిగ్రామానికి సంబంధించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు స్వర్ణ రామేశ్వర్ రెడ్డి నూతన గృహప్రవేశానికి హాజరైన రాష్ట్ర ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ డా. జిల్లెల చిన్నారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకులు ఐ సత్య రెడ్డి, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న యాదవ్, తదితర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వనపర్తి మండలం పెద్దగూడెం తాండ కాంగ్రెస్ నాయకుల పిలుపు మేరకు తుల్జా భవాని ఉత్సవంలో జిల్లేల చిన్నారెడ్డి పాల్గొని అమ్మ భవానికి కొబ్బరికాయ కొట్టి వర్షాకాలం వర్షాలు మంచిగా కురిసి పంటలు మంచిగా పండాలని కోరడం జరిగింది . తాండ వాసులు ఆరోగ్యంగా సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని మొక్కడం జరిగింది. ఉత్సవంలో పాల్గొన్న నాయకులు రవి నాయక్, భాస్కర్,శంకర్ నాయక్, పెద్దమందడి మండల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, తాండవాసులు పాల్గొనడం జరిగింది.



# మంత్రి సీతక్క హామీ

## ఆందోళన విరమించిన పూజారు లు

**టి మీడియా, మే 29,ములుగు బ్యూరో :** జిల్లాతాడ్వాయి మండలం, మేడారం గ్రామం సమ్మక్క-సారక్క ఆలయ ప్రధాన ద్వారం వద్ద బుధవారం రోజున మేడారం పూజారుల సంఘం ఆధ్వర్యంలో పూజా%తీ%రులు నల్ల బ్యాడ్జీలు ధరించి, ఒక్క రోజు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.



**మంత్రి హామీతో ధర్నా విరమించిన పూజారులు..**

మేడారం అలయ ప్రాంగణం వద్ద పూజారులు ధర్నా నిర్వహిస్తున్న విషయాన్ని తెలుసుకున్న మంత్రి సీతక్క ధర్నా ప్రాంగణానికి చేరుకుని పూజారులతో మాట్లాడి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. కాగా మంత్రి సీతక్క మేడారం పూజారులతో మాట్లడుతూ..తక్షణమే ఈ విషయం ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళ్ళి, తమకు న్యాయం జరిగేలా చూస్తానని అంతే కాకుండా వచ్చే 7 రోజుల్లో సమస్యకు పరిష్కార మార్గం చూపించే విధంగా కృషి చేస్తానని, స్పష్టమైన హామీ ఇవ్వడంతో పూజారులు ధర్నా కార్యక్రమాన్ని విరమించుకున్నారు.

# పారిశుద్ధ్య పనులు చేయించిన కార్పొరేటర్.

**టీ మీడియా, మే29, గోదావరిఖని ప్రతినిధి:** రామగుండం కార్పొరేషన్ పరిధి 33వ డివిజన్ పరిధిలో 5ఇంక్ లైన్ కాలనీలో ప్రజలు వారి ఇండ్ల ముందు నాళాలో మట్టి కూరుకుపోవడంతో దోమలు, దుర్గంధం వెదజల్లుతుండడంతో కార్పొరేటర్ దొంత శ్రీనివాస్ ను కలిసి సమస్య పరిష్కరించాలని బుధవారం డివిజన్ ప్రజలు కోరారు. వెంటనే కార్పొరేటర్ స్పందించి మున్సిపల్ సిబ్బందితో నాలాలో కూడుకుపోయిన మట్టిని తొలగించే కార్యక్రమాన్ని చేపట్టి పూర్తి చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 33వ డివిజన్ ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్సింగ్, మున్సిపల్ మేయర్, కమిషనర్ కు సమస్యను వివరించి, డివిజన్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టడం కోసం నిధులను కేటాయించి పనులు చేపట్టాలని డివిజన్ ప్రజల పక్షాన కోరామని తెలిపారు. అలాగే మున్సిపల్ సిబ్బందితో డివిజన్లో మట్టి పూడిక పనులను చేపట్టి పూర్తి చేయించడం జరిగిందని ,ఈ కార్యక్రమానికి సహకరించినటువంటి మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ఆంజనేయ స్వామిని దర్శించుకున్న నీలం మధు

**టీ మీడియా,మే 29,మెదక్:** జిల్లానర్సాపూర్ నియోజకవర్గంలో ఆధ్యాత్మికంగా ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి వారిని మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్,మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, మదన్ రెడ్డి,డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, ఇంచార్జ్ ఆవుల రాజీరెడ్డి కలిసి దర్శించుకున్నారు. శ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి ఆదేశానుసారం ఆలయంలో నిర్వహించిన మహారుద్రం, సహస్ర శ్రీ సూక్తం, సహస్ర మన్యు సూక్తం,పురుష సూక్తం, లక్ష తమలార్చన, శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ప్రత్యేక పూజలలో నీలం మధు పాల్గొని స్వామి వారి సేవలో పాల్గొన్నారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి ఆశీస్సులతో మెదక్ పార్లమెంటు నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా, కమల పుల్ సింగ్,మండల అధ్యక్షులు మల్లేష్,సుదర్శన్ గౌడ్,మాజీ ఎంపీపీ లాలిత, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



# కోటిన్నరతో పరారైన దంపతులు..

**టి మీడియా.,మే29,ఆర్మూర్** పట్టణంలోని పెర్కిట్ లో నివసిస్తున్న నీలకంఠం ప్రవీణ్ , సతీమణి నీలకంఠం సాయి లావణ్య లు కోటిన్నర డబ్బులకు ఎగనామం పెడుతూ రాత్రికి రాత్రే పరారైన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది.. నీలకంఠం ప్రవీణ్ దంపతులు డబ్బులు ఇచ్చిన వ్యక్తులకు ఎవరికీ తెలియకుండా రాత్రికి రాత్రే పెర్కిట్ నుంచి ఉడాయించారు. దీంతో పెర్కిట్ ఏరియాలో జాతీయ రహదారి ప్రక్కన కిరాణా, జనరల్ దుకాణాలతో పాటు చీరల దుకాణాన్ని సైతం ఆ దంపతులు నిర్వహించేవారు. ఆ దంపతులు రాత్రికి రాత్రే ఊడాయించగా, పెరికిట్లోని కాంతి హై స్కూల్ లో వారి పిల్లల టీసీలను కూడా తీసుకెళ్లి గ్రామానికి తిరిగి రాకుండా పక్కాడ్బందీగా అన్ని సిద్ధం చేసుకుని పరారయ్యారు. ఆ దుకాణ ఏరియాల్లోకి ఆ దంపతులకు డబ్బులు ఇచ్చి మోసపోయిన సుమారు 60 మంది వ్యక్తులు రెండు రోజులుగా వస్తూ వెళ్తూ వారి ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఆర్మూర్ రెవిన్యూ డివిజన్ పరిధిలోని ఆర్మూర్, బాల్కొండ, జక్రాన్ పల్లి తదితర మండలాల్లోని గ్రామాల్లోని ప్రజల నుండి నమ్మకం కలిగించి దండిగా డబ్బులను తీసుకుని దంపతులిద్దిరూ పరారయ్యారు. దీంతో వారికి డబ్బులు ఇచ్చి మోసపోయిన వ్యక్తులు వారి దుకాణాల వద్దకు వచ్చి రెండు రోజులుగా లబోదిబోమని మొత్తుకుంటున్నట్లు తెలిసింది. సదరు దంపతులు వారి ఇరువురి సెల్ ఫోన్లను కాల్ డైవర్ట్ పెట్టి, స్విచ్ ఆఫ్ చేసి, ఎటు వెళ్లారో తెలియకుండా చేస్తున్నారని, వారికి డబ్బులు ఇచ్చి మోసపోయిన వ్యక్తులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఏది ఏమైనా అమాయక ప్రజలను నమ్మించి మోసగించి కోటిన్నర డబ్బులతో ఉదయించిన నీలకంఠం ప్రవీణ్ నీలకంఠం సాయి లావణ్య దంపతులను సంబంధిత అధికారులు పట్టుకొని మోసపోయిన మాకు న్యాయం చేయాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.



# వ్యవసాయ శాఖ అధికారి సస్పెండ్.

**టి మీడియా.,మే29,సిద్ధిపేట :** జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కే. శివప్రసాద్ ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ శాఖలో విధులు నిర్వహించే ఓ మహిళ ఉద్యోగి పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు సదరు ఉద్యోగి కలెక్టర్ కు ఫిర్యాదు చేసింది. కాగా ఘటన పై అప్పటి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. నివేదిక ఆధారంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం.



## అవసరాల మేరకు విత్తనాలను అందజేస్తున్నాం

**-ఏ డి ఏ అనిత,**



**టి మీడియా,మే29,డిచ్ పల్లి:**జిల్లా రైతుల అవసరామగు పచ్చి రొట్టె విత్తనాలు జిలుగ విత్తనలను అన్ని సహకార సొసైటీ లో రైతుల అవసరం మేరకు సరఫరా చేయడం జరుగుతుందని రావో రోజుల్లో ఇంకా అవసరమున్న మేరకు జిలుగ విత్తనములను సహకార సొసైటీలకు సరఫరా చేయడం జరుగుతుందని, ఇంకా అవసరమైన చిలుక విత్తనాలు అన్ని సహకార సొసైటీలకు సరఫరా చేస్తామని పచ్చి రొట్టె జిలుగ విత్తనములు అవసరం మేరకు అందజేస్తామని రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయం ఏ డి ఏ అనిత, నిజామాబాద్ రూరల్ ఏడిఏ ప్రదీప్ అన్నారు. డిచ్ పల్లి మండలంలోని బర్దిపూర్ సహకార సొసైటీ లో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సహకార సొసైటీలు ప్రైవేట్ డీలర్ల వద్ద విత్తన మధు కొనుగోలు చేసిన తర్వాత విధిగా దానికి సంబంధించిన రసీదును తీసుకోవాలన్నారు నాణ్యమైన ప్యాక్ చేసిన విత్తనములనే కొనుగోలు చేయాలని వారు సూచించారు. ఎరువులు అవసరాల మేరకు వాడాలని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొంది ఆర్థికంగా లాభపడాలని వారు సూచించారు.బర్దిపూర్ సొసైటీ లో 416 బస్తాల జీలుగ విత్తనములు రైతులకు అందించడం జరిగిందని, ఎటువంటి జిలుగ విత్తనాల కొరత లేకుండా అవసరమైన రైతులకు సరఫరా చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు సహకార సొసైటీ చైర్మన్ కోసరాజు రామకృష్ణ, ఏ ఈ ఓ లు ఆశ్రిత, వంశీకృష్ణ, రూపేష్ తో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కనీస సౌకర్యాలు కల్పించాలి..

**- డబుల్ బెడ్ రూం లాబ్దిదరులు.. - వినతిపత్రం అందజేత.**



**టి మీడియా.,మే29,డిచ్ పల్లి:**ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయి గ్రామం లో అసెంబ్లీ సాదారణ ఎన్నికల నోటిఫికేషన్ కు రెండు రోజుల ముందు అందజేసిన డబుల్ బెడ్ రూం లో ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టడు తున్నమని వేంటనే సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం డబుల్ బెడ్ రూం లాబ్దిదారులు డబుల్ బెడ్ రూం లవద్ద ఆందోళన నిర్వహించి అనంతరం మండల కేంద్రానికి చేరుకుని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అంనంత్ రావు కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 6 నెలల క్రితం కెటాయించిన డబుల్ బెడ్ రూం లలో కనీస సౌకర్యాలు లేకుండా తివ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నామని వివరించారు.కరెంటు సౌకర్యం లేక మొత్తం ఒకటే మిటర్ పై 47డబుల్ బెడ్ రూం లు ఉన్నాయని, అస్తవ్యస్తంగా డ్రైనేజి సిస్టం ఉండటంతో దుర్గంధంతో అనారోగ్యంతో బాధపడు తున్నమని, ఈగల దోమలతో సాహసం చేయక తప్పడం లేదన్నారు. అన్ని విషయాలు వివరంగా విన్న ఎంపిడిఓ అనంత్ రావు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో డబుల్ బెడ్ రూం లాబ్దిదరులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్యార్థుల క్షేత్ర సందర్శన



**టి మీడియా.,మే29, అశ్వారావుపేట:**వ్యవసాయ ఆధారిత అనుబంధ యూనిట్ల సందర్శనలో బాగంగా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు చెందిన సెకండ్ ఇయర్ విద్యార్థులు బుధవారం క్షేత్ర సందర్శనలో భాగంగా ఖమ్మం జిల్లా కల్లూరు, గంగారం లో పర్యటించారు. ముందుగా కల్లూరు షుగర్ ఫ్యాక్టరీ ని సందర్శించారు. అక్కడ చక్కెర తయారీ,ఉప ఉత్పత్తులు,ముడి సరుకు, ప్రాసెసింగ్ విధానాన్ని ఫ్యాక్టరీ ఎంప్లాయ్ కన్నా రావు విద్యార్థులకు వివరించారు. ఉప ఉత్పత్తుల సేకరణ, వాటిని తిరిగి వినియోగించు పద్ధతులపై అవగాహన కల్పించారు.అక్కడ నుండి సత్తుపల్లి మండలం గంగారం కేశవా సీడ్స్ సందర్శించారు. కంపెనీలో జరిగే వీర్ ప్రాసెసింగ్ పద్ధతి,నాణ్యమైన విత్తనం తయారీ,ప్యాకింగ్,యంత్రాల పనితీరును వివరించారు. విద్యార్థుల క్షేత్ర సందర్శన తోనే నైపుణ్యం పెంపొందించు ఋకోవటం సులభంగా ఉంటుందని కళాశాల శాస్త్రవేత్తలు శిరీష, అస్లామ్,కుమారి చరిత తెలిపారు. కార్యక్రమంలో సీఈవో ఆశాజ్యోతి ఉన్నారు.

## శ్రీ సీతారాముల కళ్యాణ మహొత్సవానికి ఎమ్మెల్యే



**టి మీడియా.,మే29, శంకరపట్నం:** మండల పరిధిలోని కన్నాపూర్ గ్రామంలో బుధవారం శ్రీ వాలిసుగ్రీవ ఆంజనేయ సీతారామ స్వామి కళ్యాణోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరవగా గ్రామ ప్రజలు, ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారమైన శ్రీ సీతారామచంద్రస్వామి కన్నాపూర్ గ్రామంలో కొలువై ఉండడం గ్రామస్తుల పుణ్యఫలం అని ఆయన అభివర్ణించారు.స్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలకు ప్రతి ఒక్కరికి ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ముత్తారం గ్రామంలో సీతారామస్వామిని దర్శించుకుని, ఎల్లమ్మ జాతరలో,మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొప్పగాని బసవయ్య గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి,మహిళా అధ్యక్షురాలు చింతి రెడ్డి పద్మా రెడ్డి,కన్నాపూర్ మాజీ సర్పంచ్ లు తాటికొండ సదానందం,కాల్వ పాపి రెడ్డి, కాటం వెంకటరమణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ అడితం కుమార్,దేవునూరి కిష్టయ్య,గండికోట రవి,దేవునూరి వెంకటేష్,అడితం కుమార్, రెడ్డి పవన్ కుమార్, దేవునూరి అఖిల్, నేరెళ్ల సంతోష్,గ్రామ ప్రజలు, మహిళా మణులు, ఆంజనేయ స్వామి భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సకాలంలో సరఫరా అయ్యేనా.?

**- ఇంకా చేరని పుస్తకాలు**

**- 5వేలకు పైనే అవసరం**



**టి మీడియా.,మే29, మల్హర్ రావు:**నూతన విద్య సంవత్సరం జూన్ 12న ప్రారంభం కానుంది. మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు కావాల్సిన పాఠ్య పుస్తకాలు ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేరినట్లుగా తెలుస్తోంది.కానీ మండలానికి తరలించడంలో అలస్యమవుతుంది. దీంతో విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు సకాలంలో అందేనా.? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు పర్యటిస్తున్న ఇంకా పుస్తకాలు రాలేదు.

ఎంఆర్సీ భవనానికి చేరని వైనం..ప్రభుత్వ బడుల్లో, వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు అవసరమైయ్యే పాఠ్య,నోట్ పుస్తకాలు జిల్లాకు చేరుకున్నట్లుగా తెలిసింది. కానీ మండలానికి చేరకపోవడంతో ఇబ్బందులు ఎదురైయ్యే అవకాశాలున్నాయి.దీంతో ఈసారైనా పాఠ్య పుస్తకాల పంపిణీ విద్యాశాఖ సకాలంలో పూర్తి చేస్తుందా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.గతేడాది సరిగ్గా సరఫరా చేయకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు సకాలంలో ఇవ్వలేదు.నెల రోజులు ఆలస్యంగా అందడంతో విద్యాబోధనకు అనేక ఆటంకాలు ఏర్పడ్డాయి.ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు ప్రారంభం కాకముందే పాఠ్య పుస్తకాలు అందించాలంటే మండల విద్యాశాఖ అధికారులు పాఠ్య పుస్తకాలు మండలంలోని కొయ్యూర్ ఎంఆర్సి భవనానికి తరలించే ప్రయత్నం చేయాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**మండల పరిస్థితి ఇలా..**

మండలంలో 5 జిల్లా పరిషత్, 27 ప్రాథమిక పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత, ఒక మోడల్ స్కూల్,ఒక కస్తూర్బా ఆశ్రమ పాఠశాల మొత్తం 37 పాఠశాలలు ఉన్నాయి.ఇందులో 1848 మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారు.వీరికి ఈ ఏడాది 5,378 పాఠ్య పుస్తకాలు అవసరమవుతున్నాయి. గత విద్య సంవత్సరంలో ఇప్పటికే 20 శాతం పంపిణీ చేశారు.కానీ ఈ విద్య సంవత్సరం ఇంకా పుస్తకాలే చేరలేదు.పాఠశాలలు పున ప్రారంభానికి ముందే మండల విద్యాశాఖ కార్యాలయానికి అధికారులు పాఠ్య పుస్తకాలు అందించాల్సి ఉంది.కానీ ఈ ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతుంది.ఈసారి కూడా పాఠ్య పుస్తకాల పంపిణీకి ఇబ్బందులు ఎదురైయ్యే అవకాశాలున్నాయి.

**సకాలంలో అందిస్తాం.. ఇంచార్జి ఎంఈఓ..**

పాఠ్య పుస్తకాలు సకాలంలో అందిస్తాం.ఇందుకు సంబంధించిన సరఫరా కార్యక్రమం వేగంగా కొనసాగుతుంది.ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. జిల్లా కేంద్రానికి ఇప్పటికే పాఠ్య పుస్తకాలు చేరాయి. త్వరలో మండల కేంద్రానికి వస్తాయి.

## టాస్క్ ఫోర్స్ అధికారుల దాడి..

**- అక్రమ మట్టి రవాణ వాహనాల పట్టివేత**



**టి మీడియా.,మే29,బెజ్జంకి :** మండలంలో అర్ధరాత్రి అక్రమ దందాలపై టాస్క్ ఫోర్స్ అధికారులు అకస్మికంగా దాడి చేశారు.మంగళవారం మండల పరిధిలోని చీలాపూర్ గ్రామ శివారు నుండి మండల కేంద్రంలోని వెంచర్ కు అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలపై టాస్క్ ఫోర్స్ అధికారులు దాడి చేసి జసీబీ యంత్ర,టిప్పర్లను పట్టుకున్నారు. పట్టుబడిన వాహనాలను టాస్క్ ఫోర్స్ అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్ కు చట్టపరమైన చర్యల నిమిత్తం తరలించారు.

**ఇసుక ట్రాక్టర్ పట్టివేత**

మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుండి అర్ధరాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషనుకు తరలించినట్టు బుధవారం ఎస్ఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

**అక్రమ దందాలపై అధికారుల కంటి తడుపు ..**

గత కొద్ది నెలలుగా మండలంలో అక్రమ ఇసుక,మట్టి దందా జోరుగా సాగుతున్న సంబంధిత అధికారులు కంటి తడుపు చర్యలకు పాల్పడుతున్నారనేది అక్షరాల నిజం.విధులు నిర్వర్తించే బ్లూకోల్ట్ పోలీసులు రాత్రి సమయంలో ఇసుక అక్రమ రవాణదారులకు వత్తాసు పలుకుతూ డయల్ 100కు పిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని గాగీల్లపూర్ గ్రామస్తులు వాపోతున్నారు.పోలీసులు అక్రమ ఇసుక వాహనాలను పట్టుకోని జరిమానాతో సరిచేస్తుండడంతో యథావిధిగా ఇసుక రవాణను అక్రమార్కులు సాగిస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు.అధికారుల అండతోనే విచ్చలవిడిగా మట్టి దందా సాగిస్తున్నామని ఏ అధికారులు మమ్మల్ని ఏమి చేయలేరనే దీమాను మట్టి రవాణదారులు పలువురి వద్ద వ్యక్తం చేయడం చర్చనీయాంశం.



## బియ్యం ఇవ్వడానికి సిద్ధం..

**-అధికారులు సేకరించండి -రైస్ మిల్లర్ ల అసోసియేషన్**

**టి మీడియా.,మే29, సిద్దిపేట:**తమ వద్ద ఉన్న 4 లక్షల పైచిలుకు మెట్రిక్ టన్నుల సిఎంఆర్ బియ్యంను వెంటనే అధికారులు తీసుకోవాలని రైస్ మిల్లర్ ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొమరవెల్లి చంద్రశేఖర్ ( చందు) కోరారు. బుధవారం రైస్ మిల్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి జిల్లా రైస్ మిల్లులకు రావాల్సిన రూ 100 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం వస్తున్న దాన్యం నిల్వలు చేయడానికి స్టోరేజీలను అధికారులు చూపించాలని కోరారు. గతంలో ఉన్న సిఎంఆర్ బియ్యాన్ని సేకరించకుండానే ప్రస్తుతం ఎండాకాలం పంటకు సంబంధించిన బియ్యాన్ని మాత్రమే అధికారులు, ప్రభుత్వం తీసుకుంటున్నారని, తమ వద్ద నిలువగా ఉన్న బియ్యాన్ని కూడా వెంటనే సేకరించాలని డిమాండ్ చేశారు. 11 నెలలుగా నిలువ ఉన్న బియ్యం మూలంగా క్వింటాలకు 6 నుండి 7 కిలోల బియ్యం తరుగు వస్తుందని, బియ్యాన్ని కాపాడటానికి పురుగుమందులు చల్లుతున్నామని, కూలీలను పెట్టవలసి వస్తుందని, క్వింటాలకు రూ 500 రూపాయలు ఇవ్వాలని కోరారు. కొన్ని వార్తాపత్రికల్లో వస్తున్న కథనాలు ఈ జిల్లాలో లేవని, ఇక్కడ బియ్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ అధికారులే తీసుకోవడం లేదని, టెండర్ ద్వారా కొనుగోలు చేసిన వారు సేకరించడం లేదని అన్నారు. కరోనా కంటే ముందు ఖరీఫ్, రబీల సిఎంఆర్ బియ్యము వెంట వెంటనే తీసుకునేవారని, కరోనా తరువాత బియ్యం తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపం మూలంగా మిల్లుల యజమానులు నష్టపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంగం ప్రధాన కార్యదర్శి బుచ్చయ్య, ఉపాధ్యక్షులు బాలకిషన్, కోశాధికారి విష్ణుమూర్తి, సభ్యులు భూపతి, శంకర్, కాశీనాథ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## డీలర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన

**- నాసిరకం విత్తనాలతో మోసం చేస్తే చర్యలు**

**- వ్యవసాయ అధికారి నెలకుర్తి రవీందర్ రెడ్డి**

**టి మీడియా.,మే29,నెల్లికుదురు :** విత్తన,ఎరువుల డీలర్లు రైతుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు నాసిరకం విత్తనాలను అమ్మినట్లయితే విత్తన చట్టం ద్వారా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి నెలకుర్తి రవీందర్ రెడ్డి తెలిపాడు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో డీలర్లు వానాకాల పంటలపై తీసుకోవాల్సిన విషయాలపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు అందరూ కూడా విత్తనాలు అమ్మేటప్పుడు ప్రతి రైతుకు కచ్చితంగా రసీదు ఇవ్వవలసి ఉంటుంది. ఈ రసీదులో విత్తనాలకు సంబంధించిన వివరాలన్నీ కూడా రాసి రైతు యొక్క సంతకం తీసుకొని ఇవ్వవలసి ఉంటుంది. ఎవరైనా నాసిరకం విత్తనాలు అమ్మినట్లయితే వారి పైన విత్తన చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయి. డీలర్లు అందరూ కూడా అమ్మినటువంటి విత్తనాల వివరాలు రైతు వారిగా రిజిస్టర్లో నమోదు చేయవలసి ఉంటుంది. ఇలా నమోదు చేసిన వివరాలను రోజువారీగా వ్యవసాయ అధికారి మరియు విస్తరణ అధికారులు రిజిస్టర్ ఫోటోలు తీసి జిల్లా వ్యవసాయ అధికారికి పంపించవలసి ఉంటుంది అని తెలిపారు. డీలర్లు ఎవరైనా వ్యవసాయ శాఖ నియమ నిబంధనలు కనుగుణంగా నడుచుకోనట్లయితే వారి మీద చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయి అని తెలిపడు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వల్లంల ప్రవీణ్ వివిధ గ్రామాల విత్తనాల డీలర్లు పాల్గొన్నారు.

Spot Speed NEWS
T MEDIA
న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ
APGVB రోడ్, మామిళ్ళగూడెం, ఖమ్మం. సెల్ : 8919710365
మా సేవలు : ఉపన్యాసాలకు పాయింట్లు,
ప్రెస్ నోట్స్, ప్రత్యేక సంచికలు, యాడ్ డిజైన్స్, పేజ్ మేకింగ్
Please Subscribe : tmedia.net.in

టి- మీడియా న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ
GST IN - 36FDKPS 1308PZX
అన్ని పార్టీలు వారికి రాజకీయ ఉపన్యాస పాయింట్స్
- ప్రత్యేక (డిజిటల్, ప్రింట్) సంచికలు
- సోషల్ మీడియా సర్వీసెస్
- పత్రికలకు వార్తలు, స్టోరీలు
- అన్నిరకాల యాడ్స్ డిజైనింగ్
T MEDIA
tmedia.net.in, epaper.tmedia.net.in, News Agency & Media Consultancy,
Youtube Channel, Facebook, Instagram, Twitter
ప్రెస్మీట్ ఏర్పాటు, ప్రెస్నోట్లు తయారీ, ప్రత్యేక దిన పత్రిక డిజిటల్ ఎడిషన్లు కోసం
దేశంలో ఎక్కడి వారు అయిన సంప్రదించండి :
8919710365 కు కాల్ చేయండి

మార్కెటింగ్‌లో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్
పని చేయుటకు కావలెను
టీ మీడియా లోని ప్రింట్ /ఈ పేపర్ /పెళ్లి పందిరి /ఆన్లైన్ విభాగం /ఎలక్ట్రానిక్ విభాగం ల లో (టోటల్ తెలుగు మీడియా) మార్కెటింగ్ లో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్.. (30నుండి 40శాతం )కమిషన్ బేసిక్ పై పని చేయూటకు ఆసక్తి ఉన్నవారు 8500515365 కి పంపగలరు. అవసరం అయిన శిక్షణ ఇస్తాము. నెలకు కనీసం గా రు 20వేలు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.
తమ వివరాలు :
పేరు :...........................................................
ప్రస్తుత నివాసం :............................చదువు :..............................
సెల్ నెంబర్ :...........................................................